సాక్షి పల్నాడు

మంగళవారం ၊ 31 ၊ అక్టోబర్ ၊ 2023

I



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు.



స్మృతివనం పనులు పరిశీలన

విజయవాడ : అంబేడ్కర్ స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

న్యూస్‌రీల్

నవంబర్ 4న జిల్లా సైన్స్ నాటిక పోటీలు

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి సైన్స్ నాటిక పోటీలను నవంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం తెలిపారు. మానవ సంక్షేమం కోసం శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల ప్రాముఖ్యంపై నాటికలు ఉండాలని తెలిపారు. దీంతోపాటు చిరుధాన్యాలు–మంచి ఆహారం, ఆహార భద్రత, శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు, మూఢనమ్మకాలను పారదోలుట తదితర ఉప అంశాలతో నాటికలు ఉండాలని వివరించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు గరిష్ఠంగా 8 మంది నాటిక ప్రదర్శనలో పాల్గొనవచ్చని వెల్లడించారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన బృందాన్ని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పల్నాడు జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను నవంబర్ 10వ తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని డీఈఓ వెల్లడించారు. వివరాలకు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ ఎ.ఎ.మధుకుమార్ 90328 71234 సంప్రదించాలని సూచించారు.

తాత్కాలికంగా పలు రైళ్లు రద్దు




లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్రోణాచలం–గుంటూరు(17227), కాచిగూడ–గుంటూరు(17252) 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరు–ద్రోణాచలం(17228), కాచిగూడ–నడికుడి(07791), నడికుడి–కాచిగూడ(07792), విజయవాడ–గుంటూరు (07464), గుంటూరు–విజయవాడ(07465), గుంటూరు– కాచిగూడ(17251), మెదక్–కాచిగూడ(07578), కాచిగూడ–మెదక్(07577), విజయవాడ–గుంటూరు(07783), గుంటూరు–మాచర్ల(07779), మాచర్ల–నడికుడి (07580), నడికుడి–మాచర్ల(07579), మాచర్ల–గుంటూరు(07780), గుంటూరు–విజయవాడ(07788) రైళ్లను నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

పెదకాకాని: ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితా సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు బీఎల్‌ఓలకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గత ఆగస్టులో మండలంలో ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ జాబితాపై సర్వే నిర్వహించారు. తొలగించిన ఓట్లు, ద్వంద్వ ఓట్లు, డెత్ కేసులు, కొత్త ఓటర్ల నమోదుపై సర్వే జరిగింది. ముఖ్యంగా గత కాలానికి సంబంధించి తొలగించిన ఓట్లు, డెత్ కేసులు, షిఫ్టెడ్ ఓటర్ల పరిశీలన జరిగింది. అప్పట్లో నంబూరు గ్రామానికి చెందిన వీఆర్వో బినామీ వ్యక్తితో సర్వే చేయించడంతోపాటు వెనిగండ్లలో ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులతో కలిసి ఒకచోట కూర్చుని సచివాలయ ఉద్యోగి సర్వే చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మరికొందరు సర్వే చేయడంలోనే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ఎ.సాంబశివరావు, కొప్పురావూరు మహిళా పోలీసు ఎం.భవ్యశ్రీ, ఉప్పలపాడు బిల్ కలెక్టర్ జి.రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,783, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 844.60 అడుగుల వద్ద ఉంది.

మేలు మలుపల్లె

- సమగ్రాభివృద్ధి దిశగా పల్లెలు
- ప్రతిపక్ష సర్పంచ్ ఉన్నా కోట్ల రూపాయల ఖర్చు
- సంక్షేమ కార్యక్రమాలకు రూ.11 కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.కోటి 74 లక్షలు
- తెనాలి మండలం గుడివాడ గ్రామ అభివృద్ధి తీరిది

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ పాలన గ్రామ స్వరాజ్యానికి మేలు మలుపుగా మారుతోంది. కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, పార్టీ చూడం అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పల్లెలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా ప్రతిపక్ష మద్దతుదారులు అధికారంలో ఉన్నా.. సర్కారు ప్రగతి మంత్రంతో ముందుకు సాగుతోంది. గ్రామాల ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తోంది.

2019కి ముందు.. తర్వాత

గ్రామాల అభివృద్ధి 2019కి ముందు, ఆ తర్వాత అన్న విధంగా మారింది. అన్ని గ్రామాల రూపురేఖలు మారుతూ వస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ సచివాలయంతోపాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధితో పాటు శ్మశాన వాటికల ఆధునికీకరణ, కొత్త సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



గుడివాడ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



గుడివాడ గ్రామ సచివాలయం

గుడివాడ.. అభివృద్ధి జాడ

తెనాలి నియోజకవర్గం గుడివాడ గ్రామంలో పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం సర్పంచ్ ఎన్నిక అయ్యారు. గ్రామ జనాభా 2,900. ఓటర్లు 2,200 మందికిపైగా ఉన్నారు. వరి, పసుపు, అరటి, కూరగాయలు ప్రధానంగా పండిస్తారు. 1,164 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం 510 మందికి వివిధ రకాల పింఛన్లు వస్తున్నాయి. 1,031 రైస్ కార్డులు ఉన్నాయి. ఈ గ్రామం 2019 తర్వాత ప్రగతిబాట పట్టింది. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు నిర్మితమయ్యాయి. మౌలిక వసతులు సమకూరాయి. ఈ గ్రామంలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.11.09 కోట్లు అందాయి.

సొంత ఇంటి కల నెరవేరింది.



పూరి ఇంట్లో ఉండే వాళ్లం. ఇళ్ల స్థలం లేదు. జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు రుణం మంజూరు చేశారు. కొద్దిగా అప్పు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతింటి కల సాకారమైంది. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా మా కోడలికి రూ.లక్ష వచ్చాయి. వైఎస్సార్ చేయూత వచ్చింది. డ్వాక్రా రుణమాఫీ అయ్యింది. చాలా ఆనందంగా ఉంది.

– మత్తే మార్తమ్మ, జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణదారు, గుడివాడ, తెనాలి మండలం

నిర్మాణంలో ఉన్నవి	కేటాయించిన నిధులు (రూ.ల్లో)
ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం	10,00,000
ఎస్సీ కాలనీ సీసీ డ్రెయిన్ నిర్మాణం	6,00,000
మొత్తం	16,00,000

నాలుగేళ్లలో గుడివాడ ప్రగతిపథం ఇలా..

పూర్తయిన అభివృద్ధి పని	ఖర్చుచేసిన నిధులు(రూ.ల్లో)
గ్రామ సచివాలయం	40,00,000
రైతు భరోసా కేంద్రం	21,00,000
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	21,80,000
ఎంపీయూపీ స్కూల్‌లో నాడు–నేడు	19,50,000
అంతర్గత రోడ్లు	5,00,000
అంతర్గత డ్రెయిన్లు	15,00,000
జీజీఎంపీ డ్రెయిన్లు	7,04,000
జీజీఎంపీ రోడ్లు	1,40,000
జగనన్న లేఅవుట్లో రోడ్లు	5,50,000
హిందూ శ్మశాన వాటిక	17,00,000
హిందూశ్మశాన వాటికలో రోడ్లు	3,00,000
తిరుపతమ్మ ఆలయంలో పొంగలిషెడ్డు	8,50,000
యాదవపాలెంలో కమ్యూనిటీ హాలు	10,00,000
మొత్తం	1,74,74,000

జగనన్న మళ్లీ రావాలి



డ్వాక్రాలో స్త్రీనిధి రుణం ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నగదుతో గ్రామంలో ఫ్యాన్సీ షాపును పెట్టా. బతుకుబండి హాయిగా సాగుతోంది. బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తే షాపును వృద్ధి చేసుకుంటా. జగనన్న మళ్లీ రావాలి. నాకు డ్వాక్రా రుణం మాఫీ అయింది. వైఎస్సార్ చేయూత వస్తోంది. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకోబోతున్నాం.

– ఖురద గుంట సుకన్య, ఎస్ఎస్ ఫ్యాషన్ నిర్వాహకురాలు, డ్వాక్రా స్త్రీనిధి లబ్ధిదారు, గుడివాడ, తెనాలి మండలం



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి



గుడివాడ ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందాను. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆశీస్సులతో గతంలో తెనాలి మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేశా. గుడివాడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తిచేశాం. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించడం గర్వంగా ఉంది.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, తెనాలి

సీఎంకు రుణపడి ఉంటాం



15 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. నయం కాలేదు. పింఛన్ కోసం గత తెలుగుదేశం ప్రభుత్వంలో దరఖాస్తు చేశా. రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ మంజూరు చేశారు. రూ.ఐదువేలు వస్తున్నాయి. మందులకు సరిపోతున్నాయి. మంచంలోనే ఉంటున్నా. సీఎం జగన్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది.

– బొద్దులూరి అంబోజమ్మ, పక్షవాత పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం.

బతకాలని ఆశ కలిగించారు



1978లో మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడ్డా. రెండు కాళ్లూ విరిగాయి. ఆపరేషన్ చేశారు. కర్రలతో నడుస్తున్నా. పెళ్లి చేసుకోలేదు. నాకంటూ ఎవరూ లేరు. జీవనానికి ఇబ్బందిగా ఉండడంతో చనిపోదామనుకున్న సమయంలో సీఎం జగన్ నాకు వ్యాధిగ్రస్తుల పింఛన్ ద్వారా రూ.ఐదువేలు మంజూరు చేశారు. బతుకుపై ఆశ కల్పించారు. జీవనం హాయిగా సాగుతోంది.

– బి.సుబ్బారావు, వ్యాధిగ్రస్తుల పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.58 లక్షలు

- నవంబర్ 25 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు
- కార్తీక మాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రణాళిక
- జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్



పాత గుంటూరు: దసరా సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి 29 వరకు జిల్లా నుంచి పలు ప్రాంతాలకు 173 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపగా సుమారు రూ. 58 లక్షల అదనపు ఆదాయం లభించిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ తెలిపారు. సోమవారం గుంటూరు బస్ స్టేషన్‌లోని డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్గో విభాగంలో పార్సిల్, కొరియర్ డోర్ డెలివరి ప్రచార మాసోత్సవాలు నవంబరు 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ డోర్ డెలివరీలో 50 కేజీల వరకు అతి తక్కువ ధరలో అత్యంత భద్రంగా, వేగంగా ప్రజల ఇంటి వద్దకే ఆర్టీసీ రవాణా చేయనుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు గరుడ ఏసీ బస్సు చార్జి రూ.780 నుంచి రూ.700కు తగ్గించినట్లు వివరించారు. ఈ బస్సు గుంటూరు బస్ స్టేషన్ నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి హైదరాబాద్ (బీహెచ్ఈఎల్)కు మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు చేరుతుందని చెప్పారు. గుంటూరు–అమరావతి మధ్య రెండు బస్ స్టేషన్ల నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్తీక మాసంలో పంచారామాలకు, అరుణాచలం, అయ్యప్పస్వామి దర్శనార్థం శబరిమలైకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్టు రవికాంత్ తెలిపారు.

ఫిజియోథెరపిస్టు హత్య

గుంటూరు ఈస్ట్: ఇంట్లో ఒంటరిగా ఉన్న ఫిజియోథెరపిస్టు హత్యకు గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన సత్తెనపల్లి సీతారామాంజనేయులు (36) గుంటూరులోని ఓ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పని చేస్తున్నాడు. సీతారామాంజనేయులు గతంలో తన సోదరి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే భార్యను బెల్లంకొండలోనే వదిలేసి గుంటూరులోని గుంటూరువారితోట 5వ లైనులో నివాసం ఉంటున్నాడు. తాను పనిచేసే ఆస్పత్రిలోనే ఫార్మాసిస్టు అయిన స్వాతిరెడ్డిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి వివాహం స్వాతిరెడ్డి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. స్వాతిరెడ్డి సంవత్సరన్నర క్రితం యూఎస్‌లో ఎం ఫార్మసీ చేసేందుకు వెళ్లింది. సీతారామాంజనేయులు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రోజూ విధులకు వెళ్లి వస్తుంటాడు. నవంబరు 1న స్వాతిరెడ్డి యూఎస్ఏ నుంచి గుంటూరు రానుంది. స్వాతిరెడ్డి తండ్రి పి.శ్రీనివాసరెడ్డి ఆర్టీసీ ఉద్యోగి. శ్రీనివాసరెడ్డి ఆదివారం రాత్రి సీతారామాంజనేయులు ఇంటికి వచ్చి మాట్లాడి వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయం సీతారామాంజనేయులు అసిస్టెంట్ వచ్చేటప్పటికి అతను విగత జీవుడై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో అసిస్టెంట్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీతారామాంజనేయులు తలకు బలమైన గాయమైంది. ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ. 2.58 కోట్లు

విజయవాడ: దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మకు భవానీలు, భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల లెక్కింపు సోమవారం నుంచి ప్రారంభమైంది. తొలి రోజైన సోమవారం నిర్వహించిన లెక్కింపులో రూ. 2,58, 64,740 నగదుతో పాటు 367 గ్రాముల బంగారం 8.745 కిలోల వెండి లభించినట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కానుకల లెక్కింపులో దేవస్థానం, సేవా సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం కూడా లెక్కింపు కొనసాగుతుందని ఆలయ ఈవో పేర్కొన్నారు.



‘బెటర్‌మ్’డియెట్

ఇంటర్ విద్యకు మరో అవకాశం

- ఫెయిల్, డ్రాపవుట్లకు వరం
- విద్యా పథకాలూ వర్తింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 24 వేల మందికి సదవకాశం

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య, గ్రాడ్యుయేషన్‌కు అనుసంధానంగా ఉన్న ఇంటర్మీడియెట్.. విద్యార్థి దశలో ఎంతో కీలకమైనది. కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్‌నే అర్హతగా నిర్ధారించారు. పదో తరగతి పూర్తి చేసుకుని అనంతర కాలంలో దూరవిద్య ద్వారా నేరుగా డిగ్రీ చదివిన వారు కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్ లేక దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఉంది. యూనిఫాం సర్వీసులకు ముఖ్యంగా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంటర్ సర్టిఫికెట్ తప్పనిసరి. పదో తరగతి పూర్తిచేసుకొని కళాశాల విద్యలో అడుగిడిన విద్యార్థి ఇంటర్మీడియెట్ బోర్డు అందించే ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ వంటి కోర్సులలో చేరి తన భవిష్యత్‌కు బాట వేసుకుంటాడు. ఇంజినీర్, డాక్టర్, బ్యాంకర్, సివిల్ సర్వెంట్ తదితర రంగాలను ఎంచుకొనేందుకు ఇంటర్ విద్యను పునాదిగా భావిస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఇంటర్మీడియెట్ దశలో చాలామంది వివిధ కారణాల వల్ల చదువుకు దూరమవుతున్నారు. ఫెయిలై కొందరు, ఆర్థిక పరిస్థితుల వల్ల కొందరు మధ్యలోనే విద్యకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వం సదరు విద్యార్థులకు తిరిగి ఇంటర్మీడియెట్ విద్యను దగ్గర చేసేందుకు విప్లవాత్మక చర్యలు చేపట్టింది.

ప్రత్యేక డ్రైవ్

ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలోనే వదిలివేసిన విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. డ్రాపవుట్, పరీక్ష తప్పిన విద్యార్థులు తిరిగి ఇంటర్ చదివేలా ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గతంలో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారు తిరిగి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. విద్యార్థులు తమ దగ్గరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేటు విద్యార్థులుగా ఫీజు చెల్లించి పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించింది. వీరు ఉత్తీర్ణులైతే రెగ్యులర్ విద్యార్థుల్లానే ధ్రువపత్రాలు ఇస్తారు. దీంతోపాటు గత ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు, సప్లమెంటరీకి హాజరైన విద్యార్థుల వివరాలను పరిగణనలోకి తీసుకొంటే దాదాపు 24 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అర్ధాంతరంగా వదులుకున్నట్టు తెలుస్తోంది. వీరందరికీ మరో సదవకాశం లభించినట్టే.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇంటర్ బోర్డు సిబ్బంది

విద్యా పథకాలు వర్తిస్తాయి

ఇంటర్మీడియెట్ కళాశాల విద్యకు అర్ధాంతరంగా దూరమై తిరిగి అడ్మిషన్ పొందే విద్యార్థులకు అన్ని ప్రభుత్వ పథకాలూ వర్తించేలా సర్కారు నిర్ణయం తీసుకొంది. గతంలో ఒకసారి కళాశాలలో చేరి ప్రభుత్వ పథకాలను పొంది మధ్యలో మానివేసి తిరిగి చేరితే వారికి మరోమారు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లభించేది కాదు. వారు అప్పటికే లబ్ధి పొంది ఉండటంతో మరోమారు వాటిని పొందేందుకు అనర్హులుగా పరిగణించేవారు. అయితే ప్రస్తుతం తిరిగి కొత్తగా అడ్మిషన్ పొంది అర్హత ఉన్న విద్యార్థులకు అమ్మఒడి, గోరుముద్ద, జగనన్న విద్యాకానుక వంటి ప్రభుత్వ పథకాలను తిరిగి వర్తింపజేయనున్నారు.

రీ అడ్మిషన్లకు ప్రత్యేక డ్రైవ్

ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులు, డ్రాపవుట్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గత ఏడాది పరీక్షకు హాజరై తప్పిన విద్యార్థులు ఏ కారణం చేత 2024 మార్చిలో జరగనున్న పరీక్షకు ఫీజు చెల్లించటం లేదో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో ఇంటర్ డీఐఈఓ ఎం.నీలావతిదేవి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆయా కళాశాలలకు వెళ్లి ప్రిన్సిపల్స్ సమక్షంలో విద్యార్థులకు ఫోన్ చేసి విద్య ఆవశ్యకతను వివరిస్తూ తిరిగి అడ్మిషన్ పొందేలా అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైతే ఆయా కళాశాలల సిబ్బందిని ఇళ్లకు పంపి విద్యార్థి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాలలోని కళాశాలలకు డీఐఈఓ వెళ్లి అక్కడి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇంటర్.. బంగారు భవితకు బాట



విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన ఇంటర్మీడియెట్ విద్యను వదులుకోవద్దు. మీ బంగారు భవిష్యత్‌కు ఇంటర్ విద్య బాటలు వేస్తుంది. మీకు నచ్చిన గ్రూప్‌లో తిరిగి చేరండి. ఇది ప్రభుత్వం కల్పించిన సదవకాశం. డ్రాపవుట్స్, రీ అడ్మిషన్ కోరే విద్యార్థులు ఏవైనా సందేహాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించవచ్చు.

– ఎం.నీలావతిదేవి, ఇంటర్ డీఐఈఓ, పల్నాడుజిల్లా

ప్రతి సమస్యకూ పరిష్కారం

- కలెక్టర్ శివశంకర్
- ‘స్పందన’కు 170 అర్జీలు

నరసరావుపేట: జగనన్నకు చెబుదాం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్నకు చెబుదాం ‘స్పందన’ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 170 అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కె.వినాయకంతో కలిసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారులకు ఇండియన్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఉచిత అన్నదానం చేశారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ఐఎస్ఓ ప్రతిజ్ఞ చేయించారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

తనిఖీలు పటిష్టంగా చేయాలి

దాచేపల్లి : తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో అక్రమాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో నల్గొండ, సూర్యాపేట, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల సమావేశం సోమవారం మఠంపల్లి సమీపంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న తంగెడ చెక్‌పోస్ట్‌ను ఎస్పీ రవిశంకర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా కాకుండా పటిష్ఠ తనిఖీలు చేపట్టాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏపీ–తెలంగాణకు రాకపోకలు సాగించే వాహనాలను క్షుణంగా తనిఖీలు చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ జి.కరుణకుమార్ తదితరులు ఉన్నారు.

అడిగొప్పల–గుత్తికొండ రోడ్డు బాగుచేయండి

మాచర్ల–నరసరావుపేట రోడ్డులోని అడిగొప్పల నుంచి గుత్తికొండ వరకు రోడ్డు అధ్వానంగా తయారుకావటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే ఆరోడ్డును బాగుచేయాలి.

–వై.వెంకటేశ్వరరావు, కోటానాయక్, ప్రజాసంఘాల నాయకులు

క్లుప్తంగా

నేడు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు సంబంధించిన వలంటీర్ల వివరాలు, 2022–23 సంవత్సరానికి సంబంధించి రెగ్యులర్, స్పెషల్ క్యాంప్‌లకు సంబంధించిన రిపోర్టులు, నిధుల వినియోగానికి సంబంధించిన ధ్రువపత్రాలు, 2023–24 సంవత్సరానికి సంబంధించి మొదటి, రెండవ త్రైమాసిక రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లకు అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్, ప్రత్యేక అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ పి.అశోక్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

యార్డుకు 30,151 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 30,151 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,272 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,770 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆస్తికోసం కొడుకే చంపుతానంటున్నాడయ్యా!

- జగనన్నకు చెబుదాంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేసిన ఓ తల్లి
- పలు సమస్యలపై 60 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



బాధితురాలి సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఆస్తికోసం తన చిన్న కుమారుడు చంపుతానని బెదిరిస్తున్నాడని రెంటచింతల మండలం తుండుకోట గ్రామానికి చెందిన ఓ తల్లి జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 60 ఫిర్యాదులు స్వీకరించారు. తన చిన్నకుమారుడు ఆస్తి తనపేరుపై రాయాలని, లేకపోతే చంపుతానని శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని మహిళ పేర్కొంది. అతనిపై చర్యలు తీసుకొని తనకు రక్షణ కల్పించాలని కోరింది.

• ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ అధికారులకు సూచించారు. విచ్చేసిన ప్రజలకు దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పు చెల్లించినా.. దాడిచేసి కొట్టారు

నాకు రెండు ఇళ్లు ఉండగా ఒకదానిలో నేను నివాసం ఉంటూ రెండోదానిని అద్దెకు ఇచ్చాను. అద్దెకుంటున్న వ్యక్తి నుంచి రూ.8లక్షలు అప్పు తీసుకొని తిరిగి చెల్లించాను. వడ్డీ చెల్లించాల్సి వుంది. అతడు అద్దెకు ఉన్న ఇంటిని, నా అవసరం నిమిత్తం వేరే వ్యక్తులకు విక్రయించాను. దీంతో అతడు అకారణంగా పదిమందితో వచ్చి నాపై దాడిచేసి కొట్టాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వారిపై కేసు నమోదుచేసి నాకు న్యాయం చేయండి. – చేకూరి సత్యనారాయణ, రిటైర్డు రైల్వేఉద్యోగి, వినుకొండ

నా కుమార్తెను వేధిస్తున్నాడు..

నా కుమార్తె డిగ్రీ చదివి ఇంట్లోనే ఉంటుండగా వివాహం చేసే ప్రయత్నాల్లో ఉన్నాను. అయితే సమీప బంధువైన ఓ బీటెక్ చదివిన యువకుడు తనను వివాహం చేసుకోవాల్సిందిగా వెంటపడి వేధిస్తున్నాడు. జులాయిగా తిరుగుతుంటాడు. వివాహ సంబంధాలు కుదరకుండా వ్యవహరిస్తున్నాడు. అతడి నుంచి నా కుమార్తెను రక్షించండి. – డి.అప్పిరెడ్డి, అనంతవరం, క్రోసూరు మండలం

ఇంటిని ఆక్రమించి గెంటివేశారు..

నా భర్త చనిపోగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాను. పిల్లల్ని చూడడానికి ఊరికి వెళ్తే ఇంటిపక్కనున్న వారు ఆస్తిని స్వాధీనం చేసుకొన్నారు. ఇంట్లోకి రానీయకుండా బయటికి గెంటివేశారు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయండి. – ఓ వృద్ధురాలు, నరసరావుపేట టూ టౌన్

రూ.3లక్షలు తీసుకొని మోసం చేశారు..

నేను పొలం విక్రయించగా వచ్చిన రూ.3లక్షల నగదును మా సమీప బంధువు తన వద్ద ఉంచుతానని తీసుకొని వేరే వ్యక్తులకు వడ్డీకి ఇచ్చాడు. డబ్బులు అడుగుతుంటే నీకు దిక్కున్న చోట చెప్పుకోమని అంటున్నాడు. నాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి. – పి.ఏడుకొండలు, దివ్యాంగుడు, పుల్లనూరు, మాచవరం మండలం

కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం

- రాష్ట్ర జలవరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు


జనసేన నాయకుడు రాయుడు బాలకృష్ణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి

సత్తెనపల్లి: కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం, గుర్తింపు లభిస్తుందని, ఎన్నికల సమయంలో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు పార్టీ శ్రేణులకు ప్రోత్సాహాన్ని ఇస్తాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో గల వేణుగోపాలస్వామి గుడి కళ్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు ఆధ్వర్యంలో జనసేన నేత రాయుడు బాలకృష్ణ, ఆయన మిత్ర బృందం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల నుంచి యువత, నాయకులు వైఎస్సార్ సీపీలో చేరటం ఈ ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న ఆదరణకు నిదర్శనమ న్నారు. జనసేన నాయకుడు రాయుడు బాలకృష్ణకు, ఆయన మిత్ర బృందానికి మంత్రి అంబటి రాంబాబు అభినందనలు తెలియజేసి, పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును పూలమాలలతో రాయుడు బాలకృష్ణ, మిత్ర బృందం సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, తోట లక్ష్మీనారాయణ, యానాది, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో చేరికలు


ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన దొడ్లేరు మైనార్టీలు

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన 12 కుటుంబాల మైనార్టీ వర్గీయులు పార్టీ క్రోసూరు కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి పార్టీకండువాలు కప్పి ఘనంగా స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేద ప్రజలందరికీ అండగా ఉంటుందని అన్నారు. దొడ్లేరు గ్రామాన్ని తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీలో చేరినవారిలో దండు సైదా, దండు హుస్సేన్, దండు సలాం, దండు పెద్ద మస్తాన్‌వలి, గరికపాటి దస్తగిరి, దండు బుడే, షేక్ గడ్డిపాటి జానకి, బెల్లంకొండ అక్బర్, దండు జమాల్, కట్టల ఫరీద్‌సా కట్టల సైదాబీ, దండు జాన్‌సైదా తదితరులున్నారు. ఎంపీపీ పి.కోటయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, క్రోసూరు, దొడ్లేరు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 14 మంది టీడీపీ కార్యకర్తలు అరెస్ట్

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి ఘటనలో నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని రామాపురంలో ఈ నెల 24న జరిగిన ఈ ఘటనలో 14 మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులను అరెస్ట్ చేసి గురజాల కోర్టులో హాజరు పరిచారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున బతకమ్మ విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఊరేగించారు. ఈ నేపథ్యంలో విగ్రహాన్ని ఊరేగిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు, కార్యకర్తలు కారం చల్లి, కర్రలు, రాళ్లతో విచక్షణరహితంగా దాడికి తెగబడ్డారు. దాడిలో ఐదుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడు ఆకూరి వీరారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాడికి పాల్పడిన 14మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులను అరెస్ట్ చేసి గురజాల కోర్టులో హాజరుపరచనిట్లు ఎస్ఐ సంధ్యారాణి చెప్పారు. నిందితుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు.

రేపు కాపు విద్యార్థి వసతి గృహం ప్రారంభం



గుంటూరు రూరల్: తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 1న ఉదయం 10 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటి కాపు విద్యార్థి వసతి గృహాన్ని ప్రారంభించనున్నట్లు కార్యదర్శి బాలిశెట్టి విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు, సోదరులందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. గోరంట్ల శివారులోని విజయదుర్గానగర్, హోసన్న మందిరం పక్క లైనులో వసతి గృహాన్ని నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించిన కాపులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వసతి గృహాలకు ముఖ్యంగా బాలికల వసతి గృహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

చెంచు గూడెంలను సందర్శించిన ఐటీడీఏ పీఓ


హనుమాపురం గూడెంలో చెంచు, గిరిజన మహిళలతో మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

వెల్దుర్తి: మండలంలోని హనుమాపురం గూడెం, శివలింగాపురం గూడెంలలో ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి వి.రవీంద్రారెడ్డి సోమవారం తండాలను సందర్శించి మాట్లాడారు. మండలంలోని శివలింగాపురం, హనుమాపురం తండాలలో మూతబడిన పీటీజీ చెంచు పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు ఇక్కడకు రావటం జరిగిందన్నారు. హనుమాపురం తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడున్న చెంచులతో అంగన్‌వాడీ టీచర్ పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చెంచు గిరిజన పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చెంచు మహిళలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శివలింగాపురంలో చెంచులతో కూర్చొని మాట్లాడారు. గూడెంలో సమస్యల గురించి అడిగి తెలుసుకోవటం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం, హౌసింగ్, తాగునీటి సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకోవటం జరిగిందన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రాజెక్టు అధికారి ఎంవీ వెంకటరాజు, చెంచు గిరిజనులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు.. అభివృద్ధికి మదుపు

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


విద్యుత్ వాడకంపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ, ట్రైనీ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: విద్యుత్ పొదుపు ద్వారా అభివృద్ధికి మదుపు చేకూరుతుందనే విషయాన్ని విద్యుత్ వాడకందారులు గుర్తెరగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ వాడకంపై ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.శ్రీనివాసరావు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపు చేయడం వల్ల వ్యవసాయ పంటలకు తొమ్మిది గంటలు, గృహ వినియోగానికి 24 గంటలు వినియోగించవచ్చు అన్నారు. విద్యుత్ పొదుపుపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌ఓ కె.వినాయకం, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు, విద్యుత్ శాఖ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాసామర్థ్య సర్వే పరీక్షకు సిద్ధం చేయండి

ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు సూచించిన డీఈఓ


డీఈఓ కె.శామ్యూల్

నరసరావుపేట: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా నవంబరు 3వ తేదీన జిల్లాలో నిర్వహించే సర్వే పరీక్షకు మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీలో గణితం, లాంగ్వేజ్‌లో మాత్రమే సర్వే ఉంటుందన్నారు. జిల్లాలోని 1171 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతులకు చెందిన 31,881మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. వీరిలో మూడో తరగతి విద్యార్థులు 11,210, ఆరోతరగతి విద్యార్థులు 10,717, తొమ్మిదో తరగతి విద్యార్థులు 9,954మందికి అభ్యాసనా సామర్థ్యంపై సర్వే జరుగుతుందన్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూలలో పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించామన్నారు. మూడో తరగతి విద్యార్థులకు 60నిమిషాలు, ఆరోతరగతి వారికి 75 నిమిషాలు, తొమ్మిదో తరగతి వారికి 90నిమిషాలలో పరీక్ష రాయాల్సిఉంటుందన్నారు. దివ్యాంగులు ఈ పరీక్షకు హాజరైతే వారికి అదనంగా 30 నిమిషాలు కేటాయిస్తారన్నారు. ఇంగ్లిష్/తెలుగు సబ్జెక్ట్ సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయన్నారు. తెలుగు మీడియా మ్యాప్ అయిన విద్యార్థులకు తెలుగు, గణితంలో, ఇంగ్లిష్ మీడియం మ్యాప్ అయిన వారికి ఇంగ్లిష్, గణితంలో ప్రశ్నలు ఉంటాయన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ఈ నాలుగురోజులు ఉదయం, సాయంత్రం ప్రాక్టీసు పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

నేడు పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలో ఏడు ప్రదేశాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం వెల్లడించారు. బొల్లాపల్లి మండలం గరికపాడు గ్రామంలోని సచివాలయం, గురజాల మండలంలోని పల్లిగుంత అంబాపురం ఎంపీయూపీ ఎస్ స్కూలు, నరసరావుపేట మండలంలోని పమిడిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్, నరసరావుపేట పట్టణంలోని బరంపేటలోగల స్టేడియంలోను, చిలకలూరిపేట పురుషోత్తమపట్టణం యానాది కాలనీ, పిడుగురాళ్ల సీతారామపురం తండాలలో క్యాంపులు జరుగుతాయన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గోల్డ్ అప్రైజర్ చేతివాటం !

- బినామీ పేర్లతో బంగారం బదులు రోల్డ్‌గోల్డ్ తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు
- అప్రైజర్‌ను విధుల నుంచి తొలగించిన బ్యాంక్ అధికారులు!
- నూజెండ్ల యూనియన్ బ్యాంకులో ఘటన
- బ్యాంక్ సిబ్బంది పాత్రపైనా అనుమానాలు
- గోప్యంగా ఉంచిన సిబ్బంది
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలోని యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంక్‌లో అప్రైజర్‌గా పని చేస్తున్న వినుకొండకు చెందిన ఒక బంగారు వ్యాపారి బినామీ పేర్లతో రోల్డ్‌గోల్డ్ తాకట్టు పెట్టి బ్యాంక్‌లో నగదు రుణం పొందినట్లు సమాచారం. అయితే రీ అప్రైజర్ తనిఖీల్లో తాకట్టు పొట్లాల్లో నకిలీ బంగారాన్ని గుర్తించారు. మోసం బయటపడటంతో విషయం బయటపడకుండా అప్రైజర్ చేత డబ్బులు కట్టించి ఆ తాకట్టు పొట్లాలు వెనక్కు ఇచ్చి అప్రైజర్‌ను విధుల నుంచి తొలగించిన విషయం గోప్యంగా ఉంచారు. అప్రైజర్ బ్యాంక్‌ను మోసం చేసినా బ్యాంక్ అధికారులు మౌనం ఎందుకు వస్తున్నారంటూ, సిబ్బంది పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్రైజర్ పోస్టు ద్వారా నెలకు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేవారు ఉన్నారు. ఆ ఆదాయం చాలక కొందరు అక్రమంగా ఈ విధంగా నకిలీవి పెట్టి రుణాలు ఇప్పిస్తున్నా బ్యాంక్ సిబ్బంది ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. ఇవే కాకుండా రైతులు తాకట్టు పెట్టడానికి బ్యాంక్‌కు వచ్చినప్పుడు బంగారం నాణ్యత లేదని అబద్దాలు చెబుతూ మంచి బంగారం చేయించుకోవాలంటే తమ షాపునకు రావాలంటూ రైతులకు సదరు అప్రైజర్ చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా బ్యాంక్ అధికారులు ఎందుకు మౌనం వహించారోనని రైతులు, కొందరు బంగారం వ్యాపారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సంఘటనలపై నిజా నిజాలు విచారించి బ్యాంక్‌లను, రైతులను మోసం చేస్తున్న అప్రైజర్లపై కఠినచర్యలు తీసుకోవాలని ఖతాదారులు కోరుతున్నారు. ఇదిలాఉండగా సదరు అప్రైజర్ సుమారు రూ.40లక్షల వరకు మోసం చేసి ఉండవచ్చని అంచనా.

ఆస్ట్రేలియా–ఇండియా సాంగత్యంపై ప్రత్యేక సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం అధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరుగతుందని రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆస్ట్రేలియా కౌన్సెల్ జనరల్ శారకిర్లు హాజరై ఆస్ట్రేలియా–ఇండియా సాంగత్యంపై ప్రసంగించనున్నారని తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలోని బాల మోహన్ దాస్ సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతుందని చెప్పారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ చీఫ్ ప్యాట్రన్ గా హాజరు కానున్నారన్నారు. ప్రత్యేక అతిథులుగా రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి, ఆచార్య కె.గంగాధరరావు, ఆచార్య పి.జాన్సన్, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, ఆచార్య ఎ. ప్రమీలరాణి, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. చెన్నారెడ్డి పాల్గొంటారని తెలిపారు.